సాక్షి చిత్తూరు
బుధవారం । 22 । జనవరి । 2025



అభిప్రాయాలు చెప్పండి..వింటాం!

ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మంగళవారం వినతులను స్వీకరించారు. - 8లో



మామిడి చెట్ల కూల్చివేత

నష్టపరిహారం అందించకనే ఓ రైతుకు చెందిన మామిడి చెట్లను రెవెన్యూ, ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు కూల్చివేశారు. - 8లో



దివ్యాంగుని అవస్థ

ఏక సభ్య కమిషన్‌కు తన మొర విన్నవించుకోవడానికి విచ్చేసిన దివ్యాంగుడు లిఫ్టు పనిచేయక అవస్థ పడ్డాడు. - 8లో

న్యూస్‌రీల్

ద్రవిడ వర్సిటీలో నేటి నుంచి న్యాక్ పీర్ టీమ్ పర్యటన

– ఏడుగురు సభ్యులతో వర్సిటీ సందర్శన



కుప్పం: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో న్యాక్ పీర్ టీమ్ బుధవారం నుంచి మూడు రోజుల పాటు పర్యటించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఐదేళ్లకొకసారి న్యాక్ గుర్తింపులో భాగంగా న్యాక్ టీమ్ వర్సిటీలో పర్యటించి, నూతన గ్రేడింగ్‌ను ప్రకటించనుందన్నారు. గతంలో వర్సిటీకి 'బి' గ్రేడుతో సరిపెట్టుకుంది. దీంతో వర్సిటీ అభివృద్ధి చెందక ఐదేళ్లపాటు నత్తనడకన సాగింది. అయితే ప్రస్తుతం మరోమారు న్యాక్ గుర్తింపులో భాగంగా వర్సిటీ న్యాక్ గ్రేడింగ్‌కు సిద్ధమైంది. న్యాక్ టీమ్ రాకతో వర్సిటీని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు వర్సిటీలోని అన్ని విభాగాలు న్యాక్ బృందం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏడుగురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం వర్సిటీలో మూడు రోజుల పాటు పర్యటించి నివేదికను సమర్పించి.. నూతన గ్రేడింగ్‌ను ప్రకటించనుంది. అయితే వర్సిటీకి 'ఏ'గ్రేడ్ వస్తే అభివృద్ధి చెందుతుందని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏంటి ఈ పరీక్ష!

- దివ్యాంగ పింఛన్ పునఃపరిశీలన
- జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగుల పడిగాపులు



క్యూలో వేచియున్న పింఛన్‌దారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గత రెండు రోజులుగా దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలన చేపడుతున్నారు. తొలుత కళ్లు, చెవి, మూగ సంబంధిత సమస్యలతో సదరం సర్టిఫికెట్లు తీసుకుని పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులను సచివాలయాల వారీగా రప్పించి పరీక్షలు చేస్తున్నారు. అయితే వారు అక్కడ పరీక్ష కోసం పడిగావులు కాస్తున్నారు. నిరీక్షించి నీరసించిపోతున్నారు. మాలాంటి వాళ్లను ఎందుకు ఇలా పడిగాపులు కాయిస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ పరీక్షల్లో కొన్ని బోగస్ పింఛన్‌దారులు బయటపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

జన్మభూమి సేవలో తరించాలని కలలుగన్నావు
చిన్ననాటి నుంచే క్రమశిక్షణకు
మారుపేరుగా నిలిచావు
పట్టువదలని విక్రమార్కుడిలా
సైనిక శిక్షణ పొందావు
సరిహద్దులో గస్తీ కాస్తూ దేశ రక్షణలో
అహర్నిశలు శ్రమించావు
ఎముకలు కొరికే చలిని సైతం
లెక్క చేయకుండా ఎదురొడ్డి పోరాడావు
ముష్కరులను ముట్టడించి తిరుగులేని
ధీరత్వం ప్రదర్శించావు
ఉగ్రమూకల తూటాలకు రొమ్ము చూపి
భరతమాత ఒడిలో ఒరిగిపోయావు
ప్రజల మదిలో చిరస్మరణీయుడిగా
నిలిచిపోయావు
దేశ చరిత్రలో నీ సేవలను సువర్ణాక్షరాలతో
నిక్షిప్తం చేసుకున్నావు
వీరుడా నీకు మరణం లేదు..
ధీరుడా నీ త్యాగం వృథా పోదు



ఎగువరాగిమానుపెంటలో కార్తీక్ ఇంటి ముందు విషాదంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు

వీరుడికి కన్నీటి వందనం



వీరమరణం చెందిన కార్తీక్(ఫైల్)

ఉగ్రవాదుల కాల్పుల్లో సైనికుడు కార్తీక్ వీరమరణం

- ఆయన స్వగ్రామం ఎగువ రాగిమానుపెంట
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
- నేడు అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలు

బంగారుపాళెం: ఇంటర్‌తోనే చదువు ఆపేసి, దేశానికి సేవ చేయాలన్న తలంపుతో ఆర్మీలో సైనికుడిగా చేరాడు ఆ యువకుడు. దేశ భద్రత కోసం పదేళ్లుగా శ్రమిస్తున్నాడు. అయితే ఆదివారం జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు, సైనికుల నడుమ జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వీరమరణం పొందాడు. దీంతో మంగళవారం ఆ యువకుడి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంగారుపాళెం మండలం ఎగురాగిమానుపెంట గ్రామానికి చెందిన పంగల వరదరాజులు మందడి, సెల్వి దంపతులకు ఇద్దరు కుమారులు. వారి పెద్ద కుమారుడు రాజేష్, రెండో కుమారుడు కార్తీక్. వరదరాజులు మందడిది రైతు కుటుంబం. కార్తీక్ ప్రాథమిక విద్య బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంటర్ చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాలలో చదువుకున్నాడు. డిగ్రీలో చేరాలనుకునేలోపు 2015 నవంబర్‌లో జరిగిన ఆర్మీ సెలక్షన్లకు వెళ్లి సైనికుడిగా ఎంపికయ్యాడు. మొదట రాజస్థాన్‌లో 87 ఆర్మ్డ్ రేజ్‌మెంట్‌లో పోస్టింగ్ వచ్చింది. అక్కడ ఏడేళ్ల పాటు పనిచేశారు. అక్కడి నుంచి రెండేళ్ల క్రితం జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల నిర్మూలన కూబింగ్ కోసం రాష్ట్రీయ రైఫిల్(22 ఆర్ఆర్)విభాగానికి వెళ్లారు. రెండు నెలల క్రితం స్వగ్రామమైన ఎగువ రాగిమానుపెంట గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో గడిపారు. తిరిగి విధి నిర్వహణ కోసం జమ్ముకశ్మీర్‌కు వెళ్లాడు. ఆదివారం జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులకు ఆర్మీ జవాన్లకు మధ్య జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వీరమరణం పొందాడు. ఈ విషయాన్ని ఆర్మీ అధికారులు కార్తీక్ తండ్రి వరదరాజులు మందడికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఉగ్రవాదుల కాల్పుల్లో కార్తీక్ వీరమరణం చెందడంతో ఎగువ రాగిమానుపెంట గ్రామంలో విషాదం అలముకుంది. గ్రామానికి వచ్చినప్పుడల్లా అందరితో సరదాగా మాట్లాడేవా డని గుర్తుచేసుకున్నారు. కార్తీక్ వీరమరణం బాధ కలిగించినా దేశసేవ కోసం ప్రాణత్యాగం చేయడం గ్రామానికి గర్వకారణమన్నారు. కాగా మాజీ మంత్రి ఆర్కే రోజా ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు.



విలపిస్తున్న కార్తీక్ తల్లి సెల్వి



కార్తీక్ కుటుంబ సభ్యులు

నేడు వీరజవాన్ అంతిమ సంస్కారాలు

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం చెందిన జవాన్ కార్తీక్ అంతిమ సంస్కారాలను బుధవారం అధికార లాంఛనాలతో నిర్వహించనున్నారు. కార్తీక్ భౌతికకాయం మగళవారం రాత్రి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుంటుందని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఎగువరాగిమానుపెంట గ్రామానికి తీసుకొచ్చేందుకు సంబంధిత ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేపట్టారని జిల్లా సైనిక సంక్షేమశాఖకు చెందిన అధికారి వినాయకంరెడ్డి తెలిపారు.



కుటుంబ సభ్యులతో కార్తీక్

రెండు రోజుల క్రితం ఫోన్ చేసి మాట్లాడాడు



నా కుమారుడు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఫోన్ చేసి మాతో మాట్లాడాడు. క్షేమంగా ఉన్నానని తెలిపాడు. నాలుగు నెలల్లో ఇంటికి సెలవుపై వస్తానని చెప్పాడు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఫోన్ కాల్ వచ్చింది. రాంగ్ కాల్‌గా భావించి కట్ చేశాము. మళ్లీ కాల్ వచ్చింది. మేము ఆర్మీ అధికారులు మాట్లాడుతున్నాము. కశ్మీర్‌లో జరిగిన కాల్పుల్లో మీ అబ్బాయి గాయపడ్డాడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. సాయంత్రం మళ్లీ ఫోన్ చేసి మరణించాడని చెప్పడంతో కుప్పకూలిపోయాము. కూమారుని వీరమరణం వార్త వింటాననుకోలేదు.

– వీరజవాన్ తండ్రి వరదరాజులు మందడి

పెళ్లి సంబంధం చూశాం



ఆర్మీలో ఉన్న తమ్ముడికి పెళ్లి చేసేందుకు సంబంధాలు కూడా చూశాం. నా భార్య చెల్లెని ఇచ్చి వివాహం చేయాలనుకున్నాం. నవంబర్, డిసెంబర్ నెలల్లో పెళ్లి చేయాలనుకున్నాం. ఇంతలోనే తమ్ముడు కార్తీక్ ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం చెందాడు. తట్టుకోలేకపోతున్నా. ఆర్మీ వాళ్ల కష్టాలు తెలిసిన నాకు తమ్ముడు ఆర్మీలో చేరడం ఏ మాత్రం ఇష్టం లేదు. ఉన్నతవిద్య చదువుకుని వేరే ఉద్యోగంలో స్థిరపడాలనుకున్నా. నేను కూడా ఆర్మీ సెలక్షన్‌కు వెళ్లి తిరిగి వచ్చేశాను.

– వీరజవాన్ అన్న రాజేష్

గిరిజనుల అభ్యున్నతికి కృషి

రామకుప్పం: గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ(ఏపీఎస్టీసీఎఫ్‌సీ)చైర్మన్ బోరగం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రామకుప్పం మండలంలోని వీర్నమలతండా గిరిజనులు, కుప్పం మండలంలోని కంగుంది యానాదులతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైకార్ సంస్థ చిత్తశుద్ధితో పనిచేస్తూ ఎస్టీల అభ్యున్నతికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కోళ్లు, గొర్రెలు, పశువులు అవసరమైన వారికి పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మెన్ పీ.ఎస్.మునిరత్నం,ట్రైకార్ సభ్యులు అనురాధ, లావణ్య,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి పాల్గొన్నారు.

శిశుమరణాల కట్టడికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శిశు మరణాలను కట్టడికి క్షేత్రస్థాయిలో కృషి చేయాలని డీఐఓ హనుమంరావు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం శిశుమరణాలపై సమావేశం నిర్వహించారు. శిశు మరణాల విషయంలో అలసత్వం ఉండకూడదన్నారు. గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. వారు సరైన పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. రక్తలోపం ఉంటే వారిని నిత్యం పర్యవేక్షిస్తూ తగిన వైద్య సేవలను అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో వైద్యులు జానకీరావ్, ఉషశ్రీ , లత, సుబ్రమణ్యం, శిరీష, సింధూర, హేమవతి పాల్గొన్నారు.

ఫైళ్లపై సంతకాలు పెట్టండి మేడమ్..?

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఫైళ్లపై సంతకాలు పెట్టండి.. మేడమ్ అని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. ఏ ఫైలు తీసుకెళ్లినా డీఎంఅండ్ హెచ్ఓ సంతకాలు పెట్టడం లేదని కార్యాలయ అధికార వర్గం కోడైకూస్తోంది. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా చంద్రగిరిలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓగా పనిచేస్తున్న సుధారాణిని చిత్తూరు జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓగా ప్రభుత్వం నియమించింది. అయితే ఈమె బాధ్యతల స్వీకరణ అనంతరం కార్యాలయంలో పలు మార్పులు చోటు చేసుకున్నాయని అధికారులు అంటున్నారు. తొలుత కొందరి వద్ద ఉన్న బాధ్యతలను వేరేవారికి అప్పగించారని చెబుతున్నారు. తెల్లకాగితంపై పేరు రాసి పంపితే తప్ప తలుపులు తీయడం లేదని పలువురు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు, మండల వైద్యాధికారులు, ఇతర అధికారులు వచ్చినా లోపలికి అనుమతించకుండా గడప వద్దకే వేచి ఉండేలా చూస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఇలా గంటల కొద్ది తలుపు వద్ద వేచి ఉంటే పనులు ఎలా ముందుకు సాగుతాయని వాపోతున్నారు. అకౌంట్, పరిపాలన విభాగాలు, ప్రైవేటు ఆస్పత్రి అనుమతులకు సంబంధించిన ఫైళ్లల్లో సంతకాలు పడడం లేదని అధికారులు తలలు వాల్చేస్తున్నారు. ఆమె వద్దకు ఫైలు తీసుకెళ్లిన పట్టించుకోకుండా పక్కన పెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై డీఎంఅండ్‌హెచ్‌ను వివరణ కోరగా..ఫైలు పెండింగ్ ఎందుకు పెడుతాను. కలెక్టర్‌కు సమర్పించాల్సిన అన్ని ఫైళ్లను సకాలంలో సమర్పిస్తున్నట్లు తెలిపారు.

కాణిపాకం పాఠశాలకు స్వచ్ఛ పురస్కారం



పాఠశాల ఆవరణలో తడి, పొడి చెత్త సేకరణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల: క్లీన్ అండ్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో భాగంగా పూతలపట్టు నియోజకవర్గం, కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు దక్కిందని మంగళవారం ఆ పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరానికి తమ పాఠశాలకు జాతీయస్థాయిలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) న్యూఢిల్లీ వారిచే నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్లీన్ అండ్ గ్రీన్ స్కూల్ అవార్డు పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 12 పాఠశాలలు ఎంపిక చేశారని తెలిపారు. ఇందులో తమ పాఠశాల ఒకటిగా నిలవడం గర్వకారణమని చెప్పారు. ఈ అవార్డును ఫిబ్రవరి 4వ తేదీన న్యూఢిల్లీలో అందుకోనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన పాఠశాల ఎన్‌జీసీ కో ఆర్డినేటర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సురేంద్రబాబు, అలాగే సైన్స్ ఉపాధ్యాయులను, వీరికి తోడ్పాటును అందించిన ఉపాధ్యాయులు సోమశేఖర్‌నాయుడు, బాలయ్య, బాలసుబ్రమణ్యం, మాధవరెడ్డి, నరేష్‌బాబులను అభినందించారు. వరుసగా మూడో సారి తమ పాఠశాల ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు.

ధ్రువపత్రం.. జారీ కష్టం



- ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలింత పేరు సంధ్య. చిత్తూరు నగర శివారులోని వరిగపల్లి ప్రాంతంలో నివాసిస్తోంది. మూడేళ్లకు కిందట జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం చేసుకుంది. బిడ్డ పుట్టిన వారం తర్వాత జనన ధ్రువీకరణ పత్రం కోసం ఆస్పత్రిలోని జారీ విభాగంలో దరఖాస్తు చేసుకుంది. కొన్ని నెలల తరువాత బిడ్డ పేరు మార్చుకోవాలని ఆ విభాగానికి వెళ్లింది. కానీ ఇంత వరకు మార్పు జరగలేదు. దరఖాస్తు ఫారం సమర్పించి ఇప్పటికి మూడేళ్లు అవుతోందని, పదే పదే తిప్పంచుకుంటున్నారని సంధ్య పేర్కొంది.

మనిషి జీవన గమనంలో జనన ధ్రువీకరణ పత్రం ప్రధాన భూమిక పోషిస్తుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న ఆ పత్రం కోసం జిల్లా ప్రభుత్వాస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు.. అయినా అందని సర్టిఫికెట్.. ఒక వేళ పత్రం చేతికి అందినా అందులో తప్పులుంటే తప్పని తిప్పలు.. ఒక రోజు కాదు..వారం కాదు.. నెలల తరబడి నిరీక్షణ.. అయినా నిమ్మకు నీరెత్తిన చందంగా అధికారులు వ్యవహారం.. ఇదీ జిల్లాప్రభుత్వాస్పత్రిలో బర్త్ సర్టిఫికెట్ల కోసం జనం పడుతున్న కష్టం.

జనన పత్రానికి పురిటినొప్పులు!

- ప్రభుత్వాస్పత్రిలో నెలలు గడుస్తున్న అందని సర్టిఫికెట్లు
- పేర్లు, చిరునామా మార్పుల్లోనూ ఆలస్యం
- వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్
- పట్టించుకోని అధికారులు



క్యూలో వేచియున్న తల్లిదండ్రులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రం పొందడానికి పురిటినొప్పులు పడుతున్నారు. తల్లుల చేతికి పత్రం చేరేందుకు నెలలు గడుస్తోంది. పేర్లు, చిరునామా, తండ్రి పేరులో మార్పునకు చుక్కలు చూపిస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ల కొరత వేధిస్తోంది. దీంతో వైద్య సిబ్బందితో పత్రాల జారీ చేస్తూ, నెట్టుకొస్తున్నారు. జారీ ప్రక్రియ మధ్యాహ్నానికే ఆగిపోతోంది. దీంతో జనన ధ్రువీకరణ పత్రం పొందడం తల్లులకు విషమ పరీక్షగా మారుతోంది. దరఖాస్తులు వేల సంఖ్యలో పెడింగ్ ఉన్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ సమస్య...

కొన్ని నెలలుగా జనన ధ్రువీకరణ పత్రాల జారీ తల్లిదండ్రులను అసహనానికి గురిచేస్తోంది. బిడ్డ పుట్టిన వెంటనే పత్రం కోసం తల్లిదండ్రులు దరఖాస్తు ఫారం పూర్తి చేసి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, కాన్పు పత్రం జత చేసి సంబంధిత విభాగంలోని సిబ్బందికి అందజేస్తారు. వారు వాటిని ఆధారంగా చేసుకుని పత్రాలు జారీ చేయాలి. ఆరు నెలల క్రితం వరకు ఈ దరఖాస్తు ఫారంలోని వివరాల ఆధారంగా పత్రాలు ఇచ్చేవారు. ఇప్పుడు కొత్తగా ఆ పత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఈప్రక్రియ సిబ్బందికి పనిభారం పెంచుతోంది. దీంతో పాటు ప్రధానంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ కొరత పట్టిపీడిస్తోంది. గతంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్ ఈ పత్రాల జారీని చూసేవారు. వారికి ఉన్న కంప్యూటర్ పరిజ్ఞానంతో ఈ ప్రక్రియ కాస్త చకచక నడిచేది. ఆరు నెలల క్రితం ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ చంద్రగిరికి బదిలీ అయ్యారు. దీంతో ఆస్థానంలో ఎవరు నిలకడగా ఇమడలేకపోతున్నారు. ఇక ఈ పత్రాల జారీని ఓ హెడ్ నర్సు చేతిలో పెట్టారు. కొన్నాళ్ల తర్వాత ఆమె సెలవు పెట్టడంతో మరో స్టాఫ్‌నర్సుకు బాధ్యతలను అప్పగించారు. ఈ మధ్యలో ఇద్దరు నర్సింగ్ విద్యార్థులను కూర్చోపెట్టారు. దీంతో జారీ ప్రక్రియ అస్తవ్యస్థంగా తయారవుతోంది. డేటా ఎంట్రీ చేయాల్సిన పనులను వైద్య సిబ్బంది, విద్యార్థులకు అప్పగించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

తల్లుల నిరీక్షణ...

జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జనన సర్టిఫికెట్ల మంజూరులో నిర్లక్ష్యం దాపురిస్తోంది. ఇక్కడ బర్త్ సర్టిఫికెట్ పొందేందుకు అధికంగా తల్లులే వస్తుంటారు. వారు పత్రం తీసుకునేందుకు విభాగం ఎదుట గంటల తరబడి పడిగావులు కాస్తున్నారు. అయినా కొంత మందిని రేపు రండి అంటూ తిప్పించుకుంటున్నారు. ధ్రువపత్రాల కోసం నెలల తరబడి తిరిగినా చేతికి పత్రం రావడం కష్టంగా మారింది. మార్పులు, చేర్పులకు అయితే కాళ్ల అరిగేలా తిరుగుతున్నారు. మధ్యాహ్నం తర్వాత ఆ విభాగం తలుపులు వేసుకోవడంతో పత్రం జారీ విమర్శలకు తావిస్తోంది. సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తులు వేలసంఖ్యలో పెండింగ్ ఉన్నాయి. ఈ విషయమై అధికారుల పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు, ఆస్పత్రి వర్గాలు మండిపడుతున్నాయి. మరణ ధ్రువీకరణ పత్రం జారీ కూడా ఇలాగే తయారైందని పలువురు ఆరోపిస్తున్నారు.

నిత్యం 40 నుంచి 50 ప్రసవాలు

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో నిత్యం 40 నుంచి 50 ప్రసవాలు జరుగుతున్నాయి. ఆస్పత్రిలో పుట్టిన బిడ్డలకు ప్రసూతి విభాగంలోని మొదటి అంతస్తులో జనన ధ్రువీకరణ పత్రాల జారీ చేస్తుంటారు. గతంలో డేటా ఎంటీ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్ స్థాయి సంబంధించిన సిబ్బంది ఈ నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తి చేసి, పత్రాలు అందజేసేవారు. వారం రోజుల్లో తల్లిదండ్రుల చేతికి జనన ధ్రువీకరణపత్రాలు అందేవి. ప్రస్తుతం ఆ విభాగంలో పత్రాల జారీ గందరగోళంగా మారింది.



జనన ధ్రువీకరణ నమోదు ప్రక్రియ చేస్తున్న నర్సు

మూడు నెలలుగా తిరుగుతున్నా..



జిల్లా ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకున్నా.. పుట్టిన బిడ్డకు బర్త్ సర్టిఫికెట్ తీసుకోవాలని నవంబర్ 28వ తేదీన దరఖాస్తు చేసుకున్నాను. మూడు నెలలుగా తిరుగుతున్నాం. రేపు, మాపు అన్నారు. ఈరోజు కూడా వచ్చాం. ఇస్తారో..ఇవ్వరో తెలియదు. చాలా ఇబ్బంది ఉంది. ఇక్కడ ఒక్కో రోజు ఒక్కొక్కరు ఉంటారు. పర్మినెంట్‌గా ఒకరిని కేటాయిస్తే బాగుంటుంది.

– లావణ్య, ప్రశాంత్‌నగర్, చిత్తూరు

క్లుప్తంగా

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయండి


నూతన ఏపీసీ కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్‌ఖాన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఉర్దూ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్‌ఖాన్ కోరారు. మంగళవారం ఆయన నూతన సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏపీసీతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. ఉర్దూ పాఠశాలలకు ప్రత్యేక ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఏపీసీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉర్దూ పాఠశాలల సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 9 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందికి రూ.90 వేలు జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పు ఇచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు చేపట్టిన తనిఖీల్లో పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.90 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీనివాసులు మృతదేహం

పుంగనూరు: పట్టణ సమీపంలోని రిలయన్స్ బంక్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. రాజంపేట మండలం పొనేపల్లెకు చెందిన శ్రీనివాసులు(30) తన వాహనంపై బొంతలు తీసుకెళ్లి వ్యాపారం చేసి జీవించేవాడు. ఆయన పుంగనూరు పరిసర ప్రాంతాల్లో వ్యాపారం ముగించుకుని సొంత గ్రామానికి బైక్‌పై వెళుతూ రిలయన్స్ బంక్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

అభిప్రాయాలు చెప్పండి.. వింటాం!

- ఎస్సీ వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణ
- ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పోటెత్తిన ఎస్సీలు
- జిల్లాలో ఏకసభ్య కమిషన్ పర్యటన
- వినతులు స్వీకరించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా


వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

చిత్తూరు కలెక్టరేట్ : అభిప్రాయాలు చెప్పండి.. వింటాం అని ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ మిశ్రా అన్నారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై ఆయా సామాజిక వర్గాల ప్రజలు, సంఘాల నాయకుల అభిప్రాయాలను ఏకసభ్య కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా మంగళవారం తెలుసుకుని, వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఎస్సీ ఉప కులాల సంఘాల నాయకులు, కులాల ప్రతినిధులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ రంజన్ మిశ్రాతో పాటు చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ, తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తదితరులు పాల్గొని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతులు స్వీకరించారు. వినతులు ఇచ్చేందుకు వచ్చిన వారి అభిప్రాయాలపై పలు ప్రశ్నలు వేస్తూ, వారి అభిప్రాయాలను రికార్డు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 394 వినతులు అందినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అభిప్రాయాలు

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించి వినతులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఎస్సీ కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరుగుతుందన్నారు. నివేదిక తయారీకి అవసరమైన ప్రభుత్వ ఉద్యోగుల సమాచారం, విద్య, రాజకీయ, ఉపాధి, హౌసింగ్, పోలీస్ తదితర అంశాలపై కమిషన్ కోరిన మేరకు స్పష్టమైన సమాచారాన్ని అందించాలని తెలిపారు.

కమిషన్‌కు జిల్లా సమగ్ర వివరాలు

ఏకసభ్య కమిషన్ దృష్టికి జిల్లా సమగ్ర వివరాలను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అనంతరం చిత్తూరు జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. 2024 సాధారణ ఎన్నికల తర్వాత జిల్లాలో ఎస్సీల సమస్యల పరిష్కారం కోసం 2 ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎస్సీ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మీ, డీఎఫ్‌ఓ భరణి, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అభిప్రాయాలు ఇలా...

- ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై వెలువరిచిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు నేషనల్ వర్కింగ్ అధ్యక్షులు సుదర్శనమ్ అన్నారు. ఆర్టికల్ 341 వయలేషన్ అని చెప్పారు. ఇది మోదీ ప్రభావిత తీర్పుగా భావిస్తున్నట్లు తెలిపారు. 2004లో ఈవీ చెన్నయ్య వర్సెస్ ఏపీ గవర్నమెంట్ ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ బద్ధంగా ఉందన్నారు. చంద్రబాబు ఎస్సీ ఓట్లతో గెలిచి ఈ రోజు తమకే ద్రోహం చేస్తున్నారని విమర్శించారు.
- వర్గీకరణ చేయకూడదని ఎస్సీ సంఘ నాయకులు పార్థసారథి, మునస్వామి అన్నారు. 29 రాష్ట్రాల్లో మెజారిటీ 1/3వ వంతు ఉండాలన్నారు. పార్లమెంట్ రాజ్యసభ ఆమోదించాలని చెప్పారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.
- ఉపవర్గీకరణ చేయకూడదని ఏపీ శ్రీ రమాబాయ్ మహిళా ఎస్సీ,ఎస్టీ సంఘం చైర్మన్ దేవానంద్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాక ముందే యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ సుఖదేవ్ ఎస్సీ వర్గీకరణపై పలు వివరాలు వెల్లడించారన్నారు. ఉపవర్గీకరణ నష్టం చేకూరుస్తుందని ఆయన స్పష్టంగా తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో జిల్లా అధ్యక్షులు రాఘవులు, ఎస్ఎల్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు నరేంద్ర బాబు జాతీయ నాయకులు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పలు ప్రాంతాల నుంచి ఎస్సీలు ర్యాలీగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. విద్యా, ఉద్యోగాల్లో మాదిగలు ఎంతో వెనుకబడ్డారన్నారు. రిజర్వేషన్లలో అసమానతతోనే ప్రస్తుతం అవస్థ పడుతున్నట్లు చెప్పారు. మాదిగల నష్టాలను పరిష్కరించాలంటే ఎస్సీ వర్గీకరణ ఒక్కటే మార్గమని తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్ నిబంధనలు విధిగా పాటించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ పరిధిలో పని చేస్తున్న ఏఓలకు నిర్వహించిన శిక్షణ తరగతిలో మాట్లాడారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మండల పరిషత్ సర్వసభ సమావేశాల్లో వేదికపై ఎవరు కూర్చోవాలనే విషయంలో నిబంధనలు ఉంటాయని, వాటిని విధిగా పాటించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. మహిళ ఎంపీటీసీ సభ్యుల భర్తలు, కుమారులు సమావేశాలకు వస్తున్నట్లు తెలిసిందన్నారు. సభ్యులు కానివారిని సర్వసభ్య సమావేశంలోనికి అనుమతించ రాదని ఆదేశించారు.

అక్రమ వ్యాపారుల అరెస్టు

పుంగనూరు: సారా, కర్ణాటక మద్యం అక్రమ విక్రయం కేసుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పుంగనూరు మండలంలోని బోడేవారిపల్లె క్రాస్ వద్ద సారా విక్రయిస్తున్న వెంకటేష్‌ను పట్టుకుని అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. అలాగే చౌడేపల్లె మండలం మిట్టూరు బస్టాప్ వద్ద విక్రయించేందుకు ఉంచిన కర్ణాటక విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సుకన్య అనే మహిళను అరెస్టు చేశామన్నారు. వీరిద్దరిపై కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దివ్యాంగుని అవస్థ


లిఫ్టు పనిచేస్తుందని నిరీక్షిస్తున్న దివ్యాంగుడు మణి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాకు ఏకసభ్య కమిషన్ చైర్మన్ విచ్చేస్తున్నారని తెలుసుకుని, ఆయనకు చెప్పుకుంటే తన సమస్య తీరుతుందనే ఆశతో చిత్తూరు నగరానికి చెందిన దివ్యాంగుడు మణి మంగళవారం కలెక్టరేట్‌కు విచ్చేశాడు. కలెక్టరేట్‌లోని లిఫ్టు పని చేయకపోవడంతో మూడో ఫ్లోర్‌లో ఉన్న సమావేశ మందిరానికి మెట్లపై పాకుకుంటూ వెళ్లి ఉన్నతాధికారులకు తన సమస్యను విన్నవించుకున్నాడు. చాలా సంవత్సరాలుగా దివ్యాంగ వాహనం కోసం దరఖాస్తు చేసుకుంటున్నా మంజూరు చేయడం లేదని అధికారులకు తెలియజేశాడు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ ఆ దివ్యాంగునికి హామీ ఇచ్చాడు. కలెక్టరేట్‌లోని లిఫ్టు తరచూ పాడవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. లిఫ్టు పనిచేయకపోవడంతో మెట్లు ఎక్కుతున్నప్పుడు, దిగేటప్పుడు ఆ దివ్యాంగుని దుస్థితిని చూసిన పలువురు చలించిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లిఫ్టు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పశు ఉత్పాదకత పెంపే లక్ష్యం


మైనగుండ్లపల్లెలో పశువులకు వైద్యం చేయించి సూచనలిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్

తవణంపల్లె: పశువుల ఉత్పాదకత పెంపే లక్ష్యంగా ఉచిత పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని మైనగుండ్లపల్లె, మత్యం, ఎం.బోయపల్లె, యడమలవారిపల్లె గ్రామాల్లో మంగళవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. మైనగుండ్లపల్లెలో పశు వైద్య శిబిరాలను పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగిన నిధులు కేటాయిస్తూ పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ సేవలను పశుపోషకులకు మరింత చేరువ డానికి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. పశు వైద్యులతో పరీక్షలు చేయించి, ఉచిత వైద్యం అందిస్తామన్నారు. తేలికపాటి శస్త్ర చికిత్సలతో పాటు ఎదకు రాని, చూలు కట్టని పశువులకు, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చైర్మన్‌ను కలిసిన ఉన్నతాధికారులు


మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి విచ్చేసిన ఆయనకు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్ల కూల్చివేత

- రెవెన్యూ అధికారుల అత్యుత్సాహం
- 35 మామిడిచెట్లు కూల్చివేసిన అధికారులు


జేసీబీ సాయంతో మామిడిచెట్లను కూలుస్తున్న దృశ్యం

గుడిపాల: నష్టపరిహారం అందించకనే ఓ రైతుకు చెందిన మామిడి చెట్లను ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు కూల్చివేశారు. చలిచీమలపల్లె గ్రామానికి చెందిన సుబ్రమణ్యంనాయుడికి చెందిన భూమి చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేకు గతంలోనే కొంతభూమి పోయింది. ప్రస్తుతం అదనంగా మరో 0.40 సెంట్లు భూమిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని, భూమి కావాలని అతనికి ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు నోటీసు అందించారు. ఆ రైతు తనకు సరైన నష్టపరిహారం ఇస్తే తన భూమిని ఇస్తానని చెప్పాడు. దీంతో అతను అధికారుల మాట వినలేదని గుడిపాల తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ అధికారుల బృందం సుబ్రమణ్యంనాయుడి పొలం వద్దకు వెళ్లి, అక్కడున్న 35 మామిడి చెట్లను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఆ రైతు ఎంతమొత్తుకున్నా వినకుండా తమ పని తమదే అంటూ కానిచ్చేశారు. దీంతో ఆరైతు లబోదిబోమంటున్నాడు. నష్టపరిహారం అందజేయక ఇలాంటి పనులు చేయడం దారుణమన్నారు.

ముగిసిన ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ టూ డిపోలో మంగళ వారంతో కార్గో మాసోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో కూడా కార్గో సేవలను విస్తృతం చేయాలన్నారు. డోర్ డెలివరీ సౌకర్యాన్ని కస్టమర్లు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈ మాసోత్సవాల సందర్భంగా కస్టమర్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐ అల్తాఫ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ ఆరోగ్య మిషన్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ లిస్టును ఆన్‌లైన్‌లో పొందు పరిచినట్లు డీఎంఅండ్ హెచ్‌ఓ సుధారాణి తెలిపారు. ఇందులో అభ్యంతరాలుంటే ఈనెల 28వ తేదీలోపు సమర్పించాలన్నారు. గడువు తీరిన తర్వాత అభ్యంతరాలు స్వీకరించమని చెప్పారు. జాబితాను www.Chittoor.ap.gov.in లో పొందు పరిచినట్లు ఆమె పేర్కొన్నారు.

ఉద్యానవన అభివృద్ధికి రూ.10 లక్షలు

కాణిపాకం: కాణిపాకంలో రూ.10లక్షల వ్యయంతో ఉద్యానవన అభివృద్ధికి చుడా చైర్మన్ కటారి హేమలత ముందుకు వచ్చారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానాన్ని మంగళవారం చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) చైర్మన్ కటారి హేమలత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రూ.10 లక్షలతో ఉద్యానవనం అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈఓ పెంచల కిషోర్ తో కలిసి పలు స్థలాలు పరిశీలించారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకుని, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, చూడా అధికారులు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పుంగనూరు: మండలంలోని నేతిగుట్లపల్లె వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.23,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రహస్య సమాచారం మేరకు వలపన్ని పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

12వ పీఆర్సీ పునరుద్ధరించాలి

– డీఆర్వోకు యూటీఎఫ్ నాయకుల వినతి


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కారదర్శి జీవీ.రమణ కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డీఆర్వోతో మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2023 జులై ఒకటో తేదీ నుంచి 12వ వేతన సవరణ సంఘం అమలులో ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు 7,384 కోట్లు, ఉద్యోగుల సరెండర్ లీవుల ఎన్‌క్యాష్ నగదు 2,250 కోట్లు త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. బకాయిలను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖరనాయుడు, సహాధ్యక్షులు రెడ్డెప్పనాయుడు, ఎస్‌పి భాష,టి.దక్షిణామూర్తి, కే సరిత,డి ఏకాంబరం, ఎం పార్థసారథి, కే గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా జగదీశ్వరనాయుడు


జగదీశ్వరనాయుడును సన్మానిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా జగదీశ్వర్‌నాయుడుని నియమించినట్లు పార్టీ జిల్లా ఎన్నికల అధికారి ఎల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ సూచనల మేరకు జగదీశ్వర్‌నాయుడుని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక చేసినట్లు పేర్కొన్నారు. బీజేపీని బలోపేతం చేస్తూ, మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివనారాయణ, వెంకటేశ్వర చౌదరి, చిట్టిబాబు, శ్రీనివాసులు, రామభద్ర, షణ్ముగం, గురుగణేష్ తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

– మహిళ అరెస్టు


నిందితురాలి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

గుడిపాల: సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్ తెలిపారు. బొమ్మసముద్రానికి చెందిన రుబీనా (42) అనే మహిళా సారా విక్రయిస్తుండగా మంగళవారం పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 38 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఆమెకు సారాను సరఫరా చేసిన రాసనపల్లెకు చెందిన గిరిజగా గుర్తించి ఆమెపై కూడా చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది దేవప్రసాద్, రాజేష్, డిల్లిబాబు, తంబీష్, దీప, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

– అపోలో హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి


మాట్లాడుతున్న అపోలో హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి

తవణంపల్లె: ప్రజల సమగ్ర ఆరోగ్యాన్ని పరిరక్షణే తమ ధ్యేయమని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అరగొండ టోటల్ హెల్త్ కార్యాలయంలో సంక్రమణేతర వ్యాధుల నివారణ, పరిశోధన కార్యక్రమాన్ని డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తవణంపల్లె మండలంలో అపోలో హాస్పిటల్ ద్వారా, టోటల్ హెల్త్ ద్వారా ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. శాటిలైట్ క్లినిక్ ద్వారా హృదయ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటును నివారించడం, చికిత్స చేయడంపై టోటల్ హెల్త్ దృష్టి పెడుతోందన్నారు. టోటల్ హెల్త్ ద్వారా నిర్వహించిన పరిశోధన అధ్యయనంలో సంక్రమణేతర వ్యాధులు ఉన్నట్లు గణాంకాలు వెల్లడైనట్లు తెలిపారు. ఇందులో అధికంగా మధుమేహం, ఊబకాయం, కొలెస్ట్రాల్, రక్తపోటు బాధితులు ఉన్నట్లు తెలిపారు. యువకుల్లో గుండెపోటు, మూత్రపిండాల వైఫల్యం కారణాలతో అకాల మరణాలు సంభవిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజల్లో మధుమేహం, ప్రీ డయాబిటెక్, అధిక రక్తపోటు, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్‌పై అపోలో వైద్య కళాశాల, టోటల్ హెల్త్ సంయుక్తంగా పరిశోధనకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందులో భాగంగా పరిశోధకులు, వైద్యులు ఆరోగ్య ఇంటర్వ్యూలు, పరీక్షలు, ఈసీజీ, అవసరమైన రోగనిర్ధారణ పరీక్షలు కోసం ప్రతి ఇంటిని సందర్శిస్తారని తెలిపారు. మండలంలోని గ్రామీణ ప్రజలకు గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ పరీక్షల కోసం అత్యాధునిక మొబైల్ డయాగ్నస్టిక్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు సహకరిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు విద్య, సాంకేతిక నైపుణ్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో సుచరిత రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, అపోలో ప్రాజెక్టు ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి. వైస్ ప్రెసిడెంట్ నరోత్తమరెడ్డి, టోటల్ హెల్త్ సీఈఓ రాంబాబు, సీఓఓ నరేష్‌కుమార్ రెడ్డి,అరగొండ అపోలో మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, పీఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.